

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్థాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల ''చైతన్య రాహిత్యంలో స్త్రీ''

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**తన సుధీర్ బావని** వలలో వేసుకున్న కమలేనా? అప్పుడప్పుడూ, "కమలని పెళ్లాడకుండా మామ, అత్త, నువ్వు, మా అమ్మ, నాన్న అంతా నన్ను వెనక్కి లాగారు. నువ్వు ఆత్మహత్య చేసుకుంటానన్నావు. మామ నన్నే కాల్చి పారేస్తానన్నాడు. లేకుంటే చక్కగా కమలని  పెళ్ళాడేవాడ్ని" అని ఉడుకుమోత్తనమూ, సరదా కలిపి సుధీర్ ఈ నాటికీ అనే కమలేనా?

కమల చూస్తోంది శాంతి వేపు. ఇందాకటి తడబాటు లేదా చూపులో.

శాంతికి బాగా వొళ్ళు వచ్చింది. పొట్టిగా, అతి తెల్లగా పట్టుచీరెలో... తెల్ల ఏనుగు గున్నకి పట్టుచీరె కట్టినట్లుంది.

సుధీర్ చాలా చాలా అందంగా వున్నాడు. చాలా చాలా హుందాగా వున్నాడు. అతగాడి పక్కన ఈనాడు శాంతి దిష్టి పిడతలా వుంది. దిష్టి సున్నపు పిడతలా వుంది. తను  సుధీర్ కు సరయిన జోడీలా వుంది. తన పక్క గోపాలరావు దిష్టి బొమ్మలా, కేవలం గడ్డి బొమ్మలా వున్నాడు.

కాని శాంతికి ఇప్పుడు తను భయపడవలసిన పనిలేదు. ఆమెకు డబ్బుంటే ఉండనీ. విపరీతపు వళ్ళూ వుంది.

తనకు కీర్తి వుంది. ఎందరో పాఠకులు ఆరాధించే కీర్తి వుంది. అది ఎన్ని లక్షల డబ్బుతో కొనగలదీ శాంతి? ఏ జన్మలో సాధించగలదు? అందుకే తానిప్పుడు శాంతికేసి సూటిగా చూడగలదు. సుధీర్ కేసి సూటిగా చూడగలదు,

“అదేమిటి? మీకు ముందే పరిచయం ఉందా?

సెకెండ్ల కాలంలో ఆ గంబీర నిశ్శబ్ద భీకర భావ పోరాటంలో గోపాలరావు ప్రశ్న పేలవంగానూ, అసంబద్ధంగానూ, అసందర్భంగానూ కూడా వినిపించింది ముగ్గురుకీ.

“అహల్య అంటే ఎవరో అనుకున్నాను. నువ్వా?” మళ్ళా అంది శాంతి.

“అదేమిటే? అన్ని మాటలంటావు నువ్వా నువ్వా అని. నేనే! ఒకప్పటి నీ క్లాసుమేట్ ని, కమలని.” పకపక నవ్వింది కమల.

జబర్దస్తీగా, దర్జాగా వచ్చి గోపాలరావు పక్కన సోఫాలో కూర్చుంది.

“ఇది మా శాంతి అండీ. దీనికెంత టెక్కుండేదనీ కాలేజీలో! అబ్బో, ఇది లక్షాధికారి కూతుర్నని గీర! ఎలాగో నన్ను మాత్రం స్నేహితురాలిగానే చూసేదనుకోండి. సుధీర్ దీని బావ. దీని పెళ్ళికి వెళితే ఎన్ని సలహాలిచ్చిందో? అన్నీ గుర్తు లేవు కానీ, త్వరగా పెళ్లాడవే అనే మాట మాత్రం గుర్తుంది. అక్కడికి తనొక్కర్తే పెళ్ళాడుతున్నట్లు, ప్రపంచంలో ఆడవాళ్ళందరూ పెళ్ళిళ్ళు కాకుండా, చేసుకోకుండా ఆగిపోతున్నట్లూనూ. సుధీర్ చాలా మంచివాడు. దీంతో ఎలా వేగుతున్నాడో? అప్పుడింత ఒళ్లుండేది కాదు. రుబ్బురోలులా తయారై పోయింది. మా నాన్నా వీళ్ళ నాన్నా చాలా మంచి స్నేహితులు.” డెస్పరేట్ గా అంది కమల. కావాలనే శాంతిని ‘అది అది’ అనటం సాగించింది.

సుధీర్ కళ్ళతోనే వారించాడు కమలని.

శాంతి నిర్ఘాంతపోయి కూర్చుండి పోయింది. కమలే అహల్య అని తెలిసి వుంటే రాకపోయి వుండేది. అసలింత అభిమానం పెంచుకునేది కాదు సరికదా, ఆమె రాసిన కధల్ని చిత్రిక పట్టి ప్రచారం చేసేది.

ఎంత కాన్ఫిడెన్స్ వచ్చేసింది కమలలో. అది కీర్తి యిచ్చిన ఆత్మ విశ్వాసం, నిజానికి తానిప్పుడు చాలా లావుగా, అసహ్యంగా తయారయింది.

అసలే ‘ఉమెన్ వీక్ నెస్’ వున్న సుధీర్ ఈ మధ్య ఈ తన లావు కారణంగానూ, తననేదో భార్యగా భరిస్తున్నాడే తప్ప, గొప్ప ప్రేమగా ఏమీ లేదు. డబ్బు సంబంధాలు తప్ప ప్రేమలకు ఆట్టే విలువ లేని తమలో తనూ ఆట్టే పట్టించుకోలేదు.

కానీ ఈ రోజు... కమల సౌందర్యం ముందు తను దిష్టిబొమ్మలా వుంది.

కమల కీర్తి ముందు తన డబ్బు దిగదుడుపుగా వుంది. సుధీర్ అనిమిషునిలా కమలని ఆపాదమస్తకం తినేస్తున్నాడు చూపులతో. గోపాలరావు పాపం, వుట్టి బోళా మనిషి. కమలకీ తనకీ మధ్య స్నేహం గొప్పదని భావిస్తున్నాడు.

ఎంత దెబ్బ కొట్టింది! ప్రతీకారం తీర్చుకుంది.

నిజానికి ఆనాడు తన సొమ్ము అయిన సుధీర్ ని దోచుకోవాలనుకుంది. తను ఆత్మహత్య చేసుకుంటాననటంతో సుధీర్ పెళ్ళికి ఒప్పుకున్నాడు. ఆ అక్కసుతోనే తను ఆనాడు అవమానించింది.

ఈ రోజు కోరి వచ్చి అవమానింపబడింది.

కూల్ డ్రింక్స్ వచ్చాయి. సభ్యత కోసం తీసుకున్నా అవి చేదుగా వున్నాయి శాంతికి.

"ఎక్కడ దిగారు సుధీర్?" చనువుగా అడిగింది కమల.

ఇప్పుడామెకు సుధీర్ దగ్గర బిడియ పడేందుకేమీ లేదనిపిస్తోంది.

శాంతి లోలోపల గిల్టీగా ఫీల్ కావటమూ, కుంచించుకు పోవటమూ ఆమె మనోనేత్రాలు పసికట్టాయి. మరింత జబర్దస్తీ గా అడిగింది.

"లాయర్ రాజు, డాక్టర్ లలితల బంగళాలో." అడ్రసు చెప్పాడు సుధీర్.

మరో పెద్ద లాడ్జి పేరు చెప్పాడు. అక్కడ బిజినెసుకు సంబంధించిన వ్యక్తుల్ని కల్సుకుంటాడట. వారం పది రోజులు ఉంటాడట. తరచూ హైదరాబాదు వస్తాడట.

అసలంతా కమలకు కోడ్ భాష కాబోలనిపించింది శాంతికి.

కమలకూ అదే భావం స్ఫురించింది.

ఇక రచనలని గురించిన చర్చ ఏమీ సాగలేదు.

"నువ్వూ కమలా మాట్లాడుకుంటుండండి శాంతీ! నేనలా బిజినెస్ వ్యవహారాలు చూచుకుని వస్తాను" అన్నాడు సుధీర్ లేస్తూ. "వచ్చి కారులో పిల్చుకు వెళతాను" అని కూడా అన్నాడు.

కానీ శాంతి చప్పున లేచింది.

"మరోమారు వస్తాలే బావా. ఎలాగూ వుంటాముగా వారం పది రోజులు. నాకూ కాస్త షాపింగ్ వుంది."

కారు కదిలి పోయింది.

పిచ్చి పట్టినదానిలా చాలాసేపు విరగబడి నవ్వుతున్న భార్యకేసి ఆశ్చర్యంగా చూస్తుండి పోయాడు గోపాలరావు.

"మీరేనా కమల?" ఓ యువకుడొచ్చి తలుపు తట్టడంతో, అందాకా గతం గురించి ఆలోచిస్తున్న కమల త్రుళ్ళిపడి తలుపు తీసింది. అందాకా మనోనేత్రాలతో చూస్తున్న దృశ్యాలు ఒక్కసారిగా చెదిరి పోయాయి.

సుధీర్– శాంతి తమ యింటికి రావటం, కమలే అహల్య అని తెలిసి నిర్ఘాంత పోవటం వరకూ జరిగిన సంఘటనల దృశ్యాలన్నీ మాయమయ్యాయి. వర్తమానం గుర్తొచ్చింది. తానిప్పుడు విజయవాడలో వుంది. రామచంద్రం పర్యవేక్షణలో, పోషణలో వుంది. ఎలా జరిగిందిది? మరలా ఆమె మైకం లాంటి గతంలోకి జారబోయింది. కానీ బయట అదేపనిగా తలుపు తడుతూ ఎవరో పిలుస్తుండటంతో లేవక తప్పలేదు.

తానిప్పుడు 'అహల్య' కాదు. వుట్టి కమల. ఇక్కడ ఇరుగు పొరుగులకు అలాగే తెలుసు. తానిప్పుడు డాక్టర్ దామచంద్రం గారి పేషెంటు అని మాత్రమే తెలుసు.

తలుపు తీసింది కమల. ఓ యువకుడు నిల్చుని వున్నాడు.

"మీరేనాండి కమల?" అన్నాడు.

"ఔను బాబు."

"డాక్టర్ రామచంద్రంగారు మీకీ చీటీ యిమ్మన్నారు. ఆయన అర్జంటుగా హైదరాబాదు వెళుతున్నారట. ఊర్మిళమ్మగారికి ఆరోగ్యం బాగా లేదని ట్రంక్ కాల్ వచ్చిందట" అన్నాడా యువకుడు.

అమల ఆదుర్దాగా చీటీ చదివింది. "మా ఊర్మిళ పరిస్థితి ఆందోళనకరంగా వున్నట్లు డాక్టర్ లలిత ఫోన్ చేసి వెంటనే నన్ను రమ్మంది అహల్యా! నేను, సుమతి వెళుతున్నాం. వచ్చాక కబురు చేస్తాం. నీవు లేనిపోని ఆలోచనలు చేస్తూ బుర్ర పాడుచేసుకోక, ఆ కొరవ నవల వ్రాసుకుంటూ వుండు."

నాలుగు ముక్కలు గబగబా గిలికినట్లున్నాయి.

"అలాగే బాబూ" అంది అహల్య.

ఆ యువకుడు వెళ్ళిపోయాడు.

ఎవరీ ఊర్మిళ? తరచూ అతగాడు, "మా ఊర్మిళ" అంటుంటాడు. ఊర్మిళకు అతగాడికీ ఏం సంబంధం? ఆమెకేం జబ్బు? ఏం ప్రమాదం?

కమలకు జవాబు దొరకని ప్రశ్నలవి.

"హలో రామచంద్రం! ఊర్మిళ పరిస్థితి నాకు అయోమయంగా వుంది. నువ్వు త్వరగా రావాలి. నాకేమీ తోచటం లేదు. రాజు కూడా నీకు ఫోను చేసి పిలిపించమన్నాడు" అంది డాక్టర్ లలిత కంగారుగా.

కమల ఇంటి నుంచి రాగానే డాక్టర్ రామచంద్రానికి ఫోన్ వచ్చింది.

"ఏమిటి? ఏమయ్యింది?" ఆదుర్దాగా అడిగాడు రామచంద్రం.

"ఏమని చెప్పను? ఎలా చెప్పను? కోమాలో ఉంది. తెలివి వస్తోంది పోతోంది. 'రామచంద్రం' అంటోంది. కాస్సేపు. పెదనాన్నా అంటోంది కాసేపు. నాకేమీ తోచటం లేదు. నువ్వు చప్పున బయల్దేరి రా." అంతే చెప్పింది లలిత.

బహుశా ఎగసి వస్తున్న ఏడుపుని అదుపు చేసుకొనే ప్రయత్నంలో ఉందేమో ఆమె. గొంతు బొంగురుగానూ, కొంత అస్పష్టంగానూ వుంది.

"సరే, నేను సుమతి వస్తున్నాం."

సుమతి, రామచంద్రం కారులో హైదరాబాదు బయల్దేరారు.

కారు డ్రైవ్ చేస్తున్నాడు డ్రైవరు మస్తాను.

వెనక సీట్లో సుమతి, రామచంద్రంలు కూర్చుని వున్నారు. రామచంద్రం చాలా మౌనంగా వున్నాడు. సీటుకు చేరగిలపడి, కళ్ళు మూసుకుని వున్నాడు.

చాలా ఎక్కువగా మానసిక బాధ కలిగినప్పుడు అతగాడు మౌనంగా వుండి పోతాడని సుమతికి తెలుసు.

ఊర్మిళకి ఎలా వుంది? ఎలా వుంటుంది? చాలా రోజులుగా తను భయపడుతూనే వున్నాడు, ఊర్మిళ ఇలాంటి స్థితికి వస్తుందేమోనని. ఉదయం 'అహల్య' వ్రాసిన కాగితాలు చదువుతుంటే 'ఊర్మిళ' పాత్రలోని ఆ చైతన్యరాహిత్య స్థితి

ఆమె వర్ణించడం అద్భుతంగా వుందనిపించింది. అలాటి స్థితిలోనే ఈ ఊర్మిళ ఏనాడయినా జారి పోతుందేమోనన్న భయం ఏదో ఆ క్షణంలో కలిగింది కూడాను.

“ఊర్మిళ ఎవరు?” అని అహల్య చాలా కుతూహలంగా అడిగింది చాలామార్లు తనని.

ఊర్మిళ గురించి చెప్పాలంటే ముందస్తుగా తన బాల్యం మొదలు, జీవిత కథంతా చెప్పాలి. ఆ కథేమిటి?

కారు వెళుతోంది ముందుకు, హైదరాబాదు వేపు.

రామచంద్రం మనసు వెళుతోంది వెనక్కు.... గతంలోకి... తన బాల్యం నుంచి జరిగిన సంఘటనల వేపు.

ధనుర్మాసం శ్రీవిష్ణు దేవాలయా లన్నిటిలోనూ సూర్యోదయమయ్యే లోగా ‘తిరుమంజనం’ తిరుప్పావు, విష్ణు సహస్ర నామార్చన, పొంగలి నివేదన జరిగి పోతున్నాయి. పులిహోర, దద్ధోజనం, చక్కర పొంగలి ఇలా ధనుర్మాసం అంతా తెల్లారే సరికే నివేదన జరిగి పోవాలి.

తెల్లవారుఝామున వైష్ణవాచారులు, పూజారులు అత్యంత భక్తి శ్రద్దలతో హడావుడి పడుతూ విష్ణు ఆలయానికి వస్తారు. స్నానం చేసి, పరిశుద్ధులై, మడిబట్టలు ధరించి ఇక స్వామి పనిలో ప్రవేశిస్తారు.

స్వామి మూల విగ్రహానికి దంతధావన, ముఖ ప్రక్షాళన, తైల స్నానం, పంచామృత స్నానం పూర్తి చేయిస్తారు. క్షీరాభిషేకం చేయిస్తారు. ఆపైన కవచ ధారణ, ఉప కవచ ధారణ, సర్వాంగం మకర తోరణం, శంఖ చక్రాది ఆయుధాలంకరణ వగయిరాలనీ చేసి వస్త్రధారణ చేయిస్తారు.

తెల్లరాళ్ళు, ఎర్రరాళ్ళు పొదిగిన నామం స్వామి నుదుటి మీద అలంకరిస్తారు. స్వామి చుట్టూరా పూలమాలలు అందమయిన రీతిలో అలంకరించి, స్వామి మెడలో పూలమాల అలంకరిస్తారు. ఆపాదమస్తకం పూల సరాలు అలంకరిస్తారు. నవనవలాడే పవిత్ర తులసీ దళాలు, రకరకాల పూలు కలిపి స్వామి పాదాల మీద చల్లుతూ కేశవ నామాలు, అష్టోత్తరమూ, సహస్ర నామమూ పూజ చేస్తారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించు కుంటారు.

ఆ సమయంలో స్వామిని దర్శించే భక్తులు భక్తి పారవశ్యంతో మైమరచి పోవాలిసిందే. అగరు ధూపముల మధ్య, పూలరాసుల మధ్య, అభయ హస్తంతో, శేషతల్పశాయి చిరునవ్వులు చిందిస్తూ భక్తకోటికి అభయదానం చేస్తూ, పూల తేరులో దేవేరితో వూరేగుతున్నట్లుంటారు.

ధనుర్మాసం వస్తోందంటే చాలు, రామచంద్రానికి ఎక్కడ లేని హుషారు వస్తుంది. తెల్లవారు ఝామున చలి అనిపించదు. శేషాచారిగారు నిద్ర లేచే అలికిడి వినీవినగానే అరుగు మీద నుంచి తనూ నిద్ర లేచి కూర్చుంటాడు. చాప చుట్టిపెట్టి పక్కబట్టలు మడతవేసి పెట్టి కూర్చుంటాడు. ఇద్దరూ పెన్నా నదికి స్నానానికి వెళతారు.

పవిత్ర పినాకిని జలాలలో మునుగుతూ, తూర్పువేపు తిరిగి ఏవో మంత్రాలు జపిస్తూ, సూర్యభగవానుని స్తోత్రాలేవో చేసుకుంటూ, శేషాచారిగారు స్నానం ముగించే లోగా, ఆ కుర్రాడు స్నానం పూర్తి చేసి, మడిబట్ట కట్టుకుని శేషాచారిగారి మడిబట్ట వుండే సంచి అందిస్తాడు. ఆయన అది ధరించి, పెన్నా ఒడ్డునే కూర్చుని విష్ణు సహస్ర నామ స్తోత్రం చేస్తూనే భుజాల మీదున్న చక్రాంకితాలు పూజించుకుని నామం (నామ తీర్థం) దిద్దుకుంటారు. ఆసరికి తను రాగి బిందె తళతళా తోమేస్తాడు.

రాగి బిందె నిండుగా పవిత్ర పినాకినీ జలాలు ముంచుకుని శేషాచారిగారు భుజం మీద బిందె పెట్టుకుని నడుస్తుండగా తను ఆయనగారి రాగి పంచ పాత్ర, ఉద్ధరిణే, రాగి పళ్ళెం వగయిరాలు పట్టుకుని ఆయనగారి వెనకాలే నడుస్తాడు.

శ్రీరంగనాధుని ఆలయ ముఖ ద్వారంలో అడుగెడుతూ బిందెతోనే మోకరిల్లినట్లు క్షణకాలం ద్వారం వద్ద కూర్చుని గడప కళ్ళకద్దుకుని తిరిగి నడక సాగిస్తారాయన.

ఎర్రని పట్టు పంచె, మెడలో తులసి మాలలు, నుదుటి మీద నామం గడ్డ, తిరుచూర్ణంల నామం, (నామ తీర్థం)తో ఆజానుబాహుడయిన శేషాచారిగారు భక్తి భావం పొంగులు వారుతూ, ఒక్కోసారి లోలోపల తిరుమంత్ర జపం చేసుకుంటూ, ఒక్కోసారి శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం చేస్తూ, ఒక్కోసారి దశావతార వర్ణన శ్లోకాలు చదువుతూ, ఒక్కోసారి శ్రీ లక్ష్మీ నృసింహ సహస్ర నామ స్తోత్రం చేస్తూ అట్లా ఆ చలిలో ఆలయ ప్రాంగణంలో అడుగులు వేస్తుంటే ... పన్నిద్దరాళ్వారులో ఒకరెవరో పొరబాటుగానో లేక హృదయ పూర్వకంగానో తిరిగి ఈ రూపంలో విష్ణుసేవకు వచ్చారేమోనన్న అనుమానమూ, అనుభూతీ కలుగుతుంది. ఆసరికి ప్రధానాచారి కూడా వచ్చి, ఆలయ గర్భగుడి ద్వారం తెరచి, ద్వారబంధం వద్ద భక్తి పురస్సరంగా సాష్టాంగ నమస్కారం చేసి, లోపల ప్రవేశిస్తారు. ఉపనయనాది సంస్కారం జరగక ముందు రామచంద్రం స్వయంగా స్వామి 'తిరుమంజనం' లో గానీ గర్భగుడిలోని అన్ని పనులకు గానీ కల్పించుకునేందుకు వీలుండేది కాదు. తానూ ఆ పనుల్లో పాల్గొంటానని రామచంద్రం ఉత్సాహంగా చెప్పినపుడు శేషాచారి ఎంతో ఆనందించారు. వెంటనే ఉపనయనం చేయించి, వైష్ణవ సాంప్రదాయ దీక్ష కూడా యిప్పించారు. చక్రాంకితాలు వేయించారు.

"చూడు నాయనా రామచంద్రం! నాకు ఒక్కగానొక్క కొడుకు శ్రీనివాసాచారి. వాడికి నాలోని తిరుమంత్ర జపసిద్ధిని ధారపోసి, నా తర్వాత యిలాగే ఈ ఆలయంలోనే ఈ పూజా కార్యక్రమాలలో ప్రవేశ పెడదామనుకునేవాణ్ణి.

అదేం దురదృష్టమో వాడికి భగవంతుడు అంటే కోపం, భక్తి అంటే జుగుప్స. అంతా నటన అంటాడు. వేషం అంటాడు. మోసం అంటాడు. నాకు వాడి మూర్ఖత్వానికి నవ్వూ, జాలీ రెండూ వస్తాయి.

నటన, వేషం, మోసం భగవంతుడిలోనూ, భగవన్నామం లోనూ లేదు రామచంద్రం. కొందరు వ్యక్తులలో వుంది. అది వారి బలహీనత. భుక్తి కోసం పడే పాటు.

కానీ భగవన్నామం లోనూ, భగవత్సేవలోనూ, భగవంతునిలోనూ సత్యమే లేకపోతే ఇన్ని యుగాలుగా భగవన్నామం అన్నది నిలిచి వుండేది కాదు. అదొక్కటే వాడికి అర్థం కానిది."

"మరి నాకు ఉత్సాహం ఎందుకిలా కలుగుతోంది? మీరు చేసే ప్రతీ పనీ నాకు అతి పవిత్రంగా, అది నేనూ చేస్తే బావుండునన్న భావం ఎలా కలుగుతోంది?" అన్నాడు రామచంద్రం ఆశ్చర్యంగా.

శేషాచారిగారు నవ్వారు.

"మొదటి సంగతి నువ్వు నా కొడుకువి కావు. ఒక్కటి తెలుసుకో నాయనా రామచంద్రం. మనిషికి ఏది అతిగానూ, అతి సునాయాసంగానూ, ఆట్టే శ్రమ లేకుండానూ లభ్యం అవుతుందో దానిమీద చులకన భావన, హేళన, ఒక్కోసారి ద్వేషమూ, విముఖతా కూడా కలుగుతాయి,

భగవన్నామాన్నీ, భగవంతుని ఉనికినీ నేను నమ్ముతాను. ఎలా నమ్ముతానో తెలుసా? సర్వరూపాలలో, సర్వనామాలలో ప్రత్యణువులో భగవంతుని ఉనికి ఉందనే నా భావనకు తిరుగు లేదు. నా శ్వాసలో, శ్వాసకోశాలలో, హృదయంలో, హృదయంతరాళలలో అస్తిగతమై భగవన్నామం నిలిచి పోయింది. నా గురుదేవులు నాకు ఉపదేశించిన తిరుమంత్ర జపం నేను చేయటం లేదనిపిస్తుంది. ఉచ్వాస నిశ్వాసలలో అది కలిసి పోయి 'దాసోహం దాస దాసోహం' అనే భావనలు దాటిపోయి, "సోహం" భావనలో లీనమై పోయిందని పిస్తుంటుంది.

భగవన్నామం గురించి గానీ, భగవంతుని ఉనికి గురించి గానీ 'తర్కం' నాలో ఏ క్షణం లోనూ తలెత్తలేదు. అసలు తర్కం అవసరమనిపించనూ లేదు.

శ్రీనివాసాచారి నా కొడుకు. దైహికంగా వాడు నా బిడ్డ! ఒకానొక ప్రపంచ రీతిలో పుట్టిన బిడ్డేమో వాడు. వాడు అందుకోలేక పోయాడు నా చేయి... నా భావన. నేను చాలా ప్రయత్నించాను. వాడికి తెల్లారి లేచి కన్పించేదేమిటి? నా

విగ్రహారాధన, తిరుమంత్ర జపం, తులసి పేరులు. ఇవి అయాచితంగా లభ్యమయిన వాడికి వాటిమీద యే విధంగానూ ఆసక్తి లేదు.

నీవలా కాదు. ఎక్కడ పుట్టావో, ఎక్కడ పెరిగావో తెలీదు. గాలివాలుకు నా దగ్గరకు కొట్టుకొచ్చావు. నీకు ప్రేమ కావాలి. అది నేనిచ్చాను. నీకు నేను చేసే ప్రతిపనీ కొత్త, గొప్ప.

నీకు నేను కన్నతండ్రిని కాను. గురువుని. నిన్ను నా బాధ్యతగా పెంచి పోషించటం లేదు. పోషించి తీరవలసిన బాధ్యత నాకు లేదని నా మాటకు అర్థం. కేవలం ఆ జాలితో నాకు నీ మీద కలిగిన ఒకానొక అవ్యాజానురాగంతో (బహుశా బలవత్తర విధ ప్రేరణతో) నా దగ్గర పెంచబడుతున్నావు అంటే. అంచేత నానుండి పొందగలిగిన ప్రతి వస్తువూ, ప్రతి మంత్రమూ, ప్రతి దీక్షా, ప్రతి పైసా, ప్రతి ఉపకారమూ నీకు అపురూపమైనవి. ఆజన్మాంతరం నిన్ను నాకు కృతజ్ఞుడిగానూ, ఋణస్తుని గానూ చేసేవీనూ.

బాగా పరిశీలించు రామచంద్రం! చరిత్రలో ఏ గురువుకైనా ఆ గురువు ఔనత్యాన్నీ, ఉత్తమ బోధననీ, దివ్యానుభూతినీ అందుకొనగలిగినవారు ఆయన భార్యా, పిల్లలు అయి ఉండరు. సాధారణంగా వారికా గురువు తమ ఐహిక కోరికలు తీర్చలేదన్న కొరత, కోపమూ, చికాకూ ఉంటాయే తప్ప ఆయనగారి ఔన్నత్యం అవగతం కాదేనాడూ.

పరాయివాడు, ఎవడో అదృష్టవంతుడు ఒకడు వస్తాడు. గురువులోని దైవాన్ని చూస్తాడు. గురు బోధ కోసం గురువు తాలూకు వారి మాటలనూ, బాధలనూ భరిస్తాడు. సహిస్తాడు. గురుబోధ చేజిక్కించుకుంటాడు.

"ఇన్నేళ్ళ గురుసేవలో నువు నువ్వు పొందిందేమిటి? ఓ ఆస్తా, డబ్బా? రంభ లాంటి భార్యా? చక్కటి సంసారమా? ఏదీ లేదా?

హె! హె! హె! తులసి పూసలా, రుద్రాక్షలా? అష్టాక్షరి మంత్రమా? పంచాక్షరి జపమా? కౌపీనమా, కాషాయమా?

ఆహ్హాహ్హా! ఆ పాటి మంత్రాలు మమ్మల్ని అడగక పోయావూ. మేం చెప్పేవాళ్ళం కదా. పంచాక్షరీ, అష్టాక్షరీ, ద్వాదశాక్షరి, శ్రీ పూజ, శ్రీదేవి మంత్రోపాసన.. యిలా ఏది కావలిస్తే అది చెప్పెయ్యక పోయావా? అసలు అవన్నీ పుస్తకాలలో ఉండనే వుండే" అని హేళన చేసే వారికి ఆ శిష్యుడు సమాధానం చెప్పడు. చిరునవ్వు నవ్వుతాడు. తను పొందిన గుప్తధానం విలువ ఈ పామరులకు ఏం తెలుస్తుందనుకుంటాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments